క్లుప్తంగా

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించొద్దు



ఇన్‌చార్జి వీసీ మురళీకృష్ణకు వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

కాకినాడ సిటీ: ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లను వేధించేలా జేఎన్‌టీయూకే అధికారులు విడుదల చేసిన జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం వీసీ మురళీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ నగర కో కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ 2008లో నియమితులైన ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నైపుణ్యం మేరకు వారిని గుర్తించాలని తొలగించి పొట్టకొట్టవద్దని సూచించారు. దీనిపై వీసీ మురళీకృష్ణ స్పందిస్తూ కమ్యూనికేషన్ గ్యాప్‌లో జరిగిందని, తమ వల్ల డ్రైవర్లకే కాదు, అవుట్ సోరింగ్ ఉద్యోగులు ఎవరికీ అన్యాయం జరగదన్నారు. వీసీని కలిసిన వారిలో పలివెల వీరబాబుతో పాటు నగర కన్వీనర్ మలక వెంకటరమణ, జిల్లా కార్యదర్శి చంద్రమళ్ల పద్మ తదితరులు ఉన్నారు.

ఆడిట్ ఫీజు త్వరగా చెల్లించాలి

బోట్‌క్లబ్: ప్రతి ఏటా చెల్లించే ఆడిట్ ఫీజు, కంట్రిబ్యూషన్ వీలైనంత త్వరగా చెల్లించాలని దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణికుమార్ ఆలయ ఈఓలకు సూచించారు. స్థానిక దేవదాయశాఖ కార్యాలయంలో మంగళవారం జిల్లాలోని సత్రాలు, ఆలయ ఈఓలతో ఆయన సమీక్షించారు. పలువురు ఈవోలు గత ఏడాది కూడా వీటిని చెల్లించలేదన్నారు. దీనిలో బకాయిలు భారీగా పెరిగిపోయాయన్నారు. ఆయా సత్రాలు, దేవాలయాలు ఈఓలు ఈ నెలాఖరులోగా చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో ఆలయ ఈఓలు, సత్రాలు ఈఓలు పాల్గొన్నారు.

హంస వాహనంపై వేంకటేశ్వరుడు

బోట్‌క్లబ్: స్థానిక రామకృష్ణారావుపేటలోని శ్రీ, భూ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామి వారు హంస వాహనంపై ఊరేగారు. ఉదయం స్వామి వారికి ఆలయ ధర్మకర్త మునగాల గురునాథరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారు రామకృష్ణారావుపేటలోని పలువీధుల్లో ఊరేగారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


తప్పుల తడకగా ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా

కరప: మండల పరిధిలోని ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా తప్పుల మయంగా ఉందని, తమకు ఓటు హక్కు ఇస్తారో, ఇవ్వరోనని ఓటర్లు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. ఓటర్ల నమోదు దరఖాస్తుతో తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్, ఇతర ధ్రువపత్రాలు ఇచ్చినా తప్పుగా నమోదు చేయడంపై ఓటర్లు ప్రశ్నిస్తున్నారు. విద్యార్హతల కాలమ్‌లో ఎస్ఎస్‌సీ అని, క్వాలిఫికేషన్ అని, అన్ ఎడ్యుకేటెడ్ అని, ఒకటో తరగతి, 5వ తరగతి అని నమోదుచేశారు. మరికొంత మందికి పుట్టినరోజు కూడా తప్పుగా నమోదు చేశారు. ఐటీఐ చదివిన వారిని కూడా జాబితాలో చేర్చడం తదితర తప్పులను చూసి పట్టభద్రులు విస్మయం చెందుతున్నారు. అవగాహన లేని సిబ్బందితో హడావిడిగా దరఖాస్తుల స్వీకరణలో ఉంచి, వాళ్ల ఇష్టానుసారం ఓటర్ల జాబితా రూపొందించడం విమర్శలకు తావిచ్చింది. ఉదాహరణకు ఓటర్ల ముసాయిదాలో వరస సంఖ్య 450లో నాగఫణీంద్ర క్వాలిఫికేషన్ ఎస్ఎస్‌సీ అని పడింది. 429లో రావు వంశీకృష్ణ ఐటీఐ చదివినట్టు, 759లో అప్పలస్వామి కామిరెడ్డి ఫస్ట్‌క్లాస్ చదివినట్టుగా నమోదు చేశారు. తమకు ఓటు వేసుకునే అవకాశమిస్తారా, వెనక్కి పంపేస్తారా అని పట్టభద్రులు ప్రశ్నిస్తున్నారు.

లైబ్రరీకి స్టడీ మెటీరియల్ బహూకరణ

కరప: స్థానిక ఉప గ్రంథాలయానికి సానా సతీష్‌బాబు ఫౌండేషన్ రూ.10 వేలు విలువైన స్టడీ మెటీరియల్‌ను బహూకరించారు. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు సూచన మేరకు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ మంగళవారం ఈ మెటీరియల్‌ను అందజేశారు. మాజీ సర్పంచ్ తాతీలు, పెంకే రవివర్మ, అడపా శ్రీను తదితరలు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో బీహార్ వాసి మృతి



మృతి చెందిన బీహార్ వాసి

పెద్దాపురం: జట్టు కూలిగా పనిచేస్తున్న బీహార్ వాసి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మంగళవారం స్థానిక లలిత రైస్ ఇండస్ట్రీలో చోటుచేసుకుంది. ఎస్సై మౌనిక కథనం ప్రకారం బీహార్‌కు చెందిన షబ్బీర్‌హమ్ ఫ్యాక్టరీ సమీపంలో బాత్రూంలో విగతజీవిగా ఉండడాన్ని గమనించిన స్థానికులు ఫ్యాక్టరీ యాజమాన్యానికి, పోలీసులకు సమాచారం అందించారు. మృతి చెందిన వ్యక్తిని బీహార్ వాసిగా గుర్తించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మౌనిక తెలిపారు.

వసతి వెతలకు సెలవు

- జేఎన్‌టీయూకేలో పూర్తయిన పీజీ హాస్టల్
- చివరి దశలో రోడ్లు, డ్రైనేజీ, స్నాతకోత్సవ భవన నిర్మాణాలు
- గత ప్రభుత్వ హయాంలో నిధుల విడుదల
- ప్రారంభానికి వీలుగా పనులు వేగవంతం



పూర్తయిన పీజీ వసతి గృహం

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకే విద్యార్థులకు వసతి గృహ సమస్య తీరనుంది. ఈ ఏడాది చివరినాటికి ఈ భవనాన్ని ప్రారంభించేందుకు వీలుగా పనులు వేగవంతం చేశారు. కళాశాలలో మొదట కేవలం ఇంజినీరింగ్ విద్యార్థులకు మాత్రమే హాస్టల్ సదుపాయం ఉండేది. ఎంటెక్, ఎంసీఏ, ఎంబీఏ వంటి పీజీ కోర్సులకు కేవలం తరగతులు తప్ప వసతి సదుపాయం లేకపోవడంతో బయట ప్రైవేట్ హాస్టళ్లపై ఆధారపడుతున్నారు. దీంతో దాదాపు 300 వరకూ ఉండే పీజీ విద్యార్థులకు చాలా సమస్యగా ఉండేది. ముఖ్యంగా మహిళలకు చాలా అసౌకర్యంగా ఉండేది. దీంతో పీజీ కోర్సులలో చేరిన మహిళా విద్యార్థులలో ఏడాదికి ఐదు నుంచి పది వరకు డ్రాపౌట్స్ ఉండేవి. హాస్టళ్లు సరిపడక చివరకు స్టూడెంట్ ఎమినిటీ భవనంలో పై అంతస్తులో ఉన్న క్యాంటిన్ హాల్, గదుల్ని విద్యార్థుల వసతికి వినియోగించాల్సి పరిస్థితి ఏర్పడుతోంది. ఈ సమస్యపై గతంలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వహించి అప్పటి రూసా కో–ఆర్డినేటర్‌గా ఉన్న మాజీ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు దృష్టి సారించారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ 12, 13వ పంచవర్ష ప్రణాళికలలో అమలు చేసే విధంగా రూసా అనే పథకం ద్వారా వర్సిటీకు రూ.20 కోట్లు వచ్చాయి. ఈ పథకం ఉన్నత విద్యలో విద్యార్థుల సంఖ్య పెంచడంతో పాటు నాణ్యమైన విద్యను అందించడానికి ప్రవేశపెట్టినది. ఈ నిధులతో గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర మంత్రులచే శంకుస్థాపన చేయడంతో పాటు పనులు వేగవంతం చేశారు. దీంతో విద్యార్థులకు నూతన భవనాలు, ఆధునిక వసతుల కల్పనకు మరింత ఊతమిచ్చింది.

రూసా నిధులు కేంద్రం రూ.12 కోట్లు, రాష్ట్ర వాటా రూ.8 కోట్లు కలిపి రూ.20 కోట్లతో వర్సీటీలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. తొలి విడతగా రూ.10 కోట్లు విడుదల చేశారు. వీటిలో ఆరు కోట్లతో వసతి భవనాలు, నాలుగు కోట్లతో పాత భవనాల ఆధునీకరణ, ఆధునిక పరికరాలు తదితర వాటికి వినియోగిస్తున్నారు. అంతేగాక వర్సిటీలో దాదాపు రూ.50 కోట్లతో చేపట్టనున్న రోడ్లు, డ్రైనేజీ, స్నాతకోత్సవ భవనానికి ఏవిధమైన ఆర్భాటం లేకుండా శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఇవి కూడా దాదాపు 70 శాతం వరకూ పూర్తి చేయగా మరో మూడు నెలల్లో ప్రారంభానికి సిద్ధం చేయనున్నారు.

ఈ ఏడాదికి అందుబాటులోకి..



పీజీ హాస్టల్ భవనం ఈ ఏడాది వచ్చే విద్యార్థులకు అందుబాటులోకి తేచ్చేలా చర్యలు తీసుకుంటాం. వర్సిటీకి ఇన్‌చార్జి వీసీగా పనిచేసిన ఏడు నెలల్లో వర్సిటీలో చేపడుతున్న రోడ్లు, డ్రైనేజీ, స్నాతకోత్సవ భవన పనుల పురోగతిపై దృష్టి పెట్టాను. వర్సిటీకి పూర్తి స్థాయి వీసీని నియమించినందు వల్ల ఆయనతో ప్రారంభిస్తాము.

– ప్రొఫెసర్ మురళీకృష్ణ, ఇన్‌చార్జి వీసీ, జేఎన్‌టీయూకే

అంగన్‌వాడీలకు జ్ఞాన జ్యోతి శిక్షణ



అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న బృందం

కాకినాడ క్రైం: మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖల సంయుక్త ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మంగళవారం జ్ఞాన జ్యోతి శిక్షణ ప్రారంభమైంది. సాలిపేట బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 167 మంది కార్యకర్తలు పాల్గొన్నారు. మూడేళ్ల పాటు ఏడాదికి రెండు దశల్లో 20 రోజుల చొప్పున ఈ శిక్షణ నిర్వహించనున్నారు. అందులో భాగంగా తొలి ఏడాది తొలి దశ శిక్షణను ప్రారంభించారు. పీపీ–1, పీపీ–2 దశలుగా విభజించే 4 ఏళ్ల నుంచి 6 ఏళ్ల మధ్య వయసున్న పిల్లల సంరక్షణ, గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణ లక్ష్యంగా ఈ శిక్షణకు రూపకల్పన చేశారు. పిల్లల మానసిక, శారీరక వృద్ధికి తీసుకోవలసిన జాగ్రత్తలు, గర్భిణులు, బాలింతలను సంరక్షించుకునే విధానాలను శిక్షణలో బోధించారు. జిల్లా రిసోర్స్ పర్సన్లతో పాటు అంగన్వాడీ సూపర్‌వైజర్లు బోధకులుగా వ్యవహరించారు. ప్రీ ప్రైమరీ పిల్లలకు బోధనా విధానాలు, ఎర్లీ చైల్డ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్‌పై తల్లిదండ్రులకు అవగాహన ప్రధానాంశాలుగా శిక్షణ సాగింది. 20 రోజుల పాటు నిర్వహించనున్న ఈ శిక్షణలో తొలి ఆరు రోజులు ఆఫ్‌లైన్‌లో, మిగిలిన 14 రోజులు ఆన్‌లైన్‌లో తరగతులు నిర్వహించనున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ తరగతులు సాగనున్నాయి.

భోజనాలు అధ్వానం

శిక్షణ కార్యక్రమానికి హాజరైన అంగన్వాడీ కార్యకర్తలు మధ్యాహ్న భోజనాలు బాగోలేదని, తక్షణమే భోజనాల నాణ్యతపై దృష్టి సారించాలని అంగన్వాడీలు అధికారులకు తమ గోడు వెళ్లబోసుకున్నారు.

ఆటిజమ్‌పై అవగాహన

బోట్‌క్లబ్: స్థానిక నాగమల్లితోట జంక్షన్‌లో సత్య డెంటల్ క్లినిక్‌లో మంగళవారం ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆటిజమ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి అద్దాల సత్యనారాయణ మాట్లాడుతూ ఆటిజమ్ ఉన్న వారు ముఖ కవళికలు, శరీర భంగిమలు, ప్రవర్తన గుర్తించడంలో బలహీనంగా ఉంటారన్నారు. వారి ఆనందం, విజయాలను ఇతరులతో పంచుకోవడానికి ఇష్టపడరన్నారు. వారి పేరు పెట్టి పిలిచినా తిరగలేకపోవడం, సూచించడానికి, చూపించడానికి సంజ్ఞలను ఉపయోగించడంలో వైఫల్యం ఉంటుందన్నారు. ఈ వ్యాధి ఉన్న వారికి మానసిక వైద్య నిపుణులతో కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీ (సిబిటి) చేయించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కన్వీనర్ శ్రీవల్లి, సభ్యులు పద్మావతి, నాగేంద్ర పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



అదనపు కార్యదర్శిని కలసి వినతిపత్రం అందజేస్తున్న నగర కమిటీ నాయకులు

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ డిమాండ్

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో ఇచ్చిన రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా సమస్యల పరిష్కారం కోరుతూ యూనియన్ నగర కమిటీ ప్రధాన కార్యదర్శి తుపాకుల లక్ష్మీనారాయణ అదనపు కమిషనర్ కేటీ సుధాకర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయనతో కలసి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మిక సమస్యలు పరిష్కరించాలని, ఈనెల 19న స్థానిక ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తామన్నారు. కాకినాడలో ఉన్న మస్తర్ల కార్యాలయం వద్ద ఈ మేరకు ఆందోళన నిర్వహిస్తామని, 24న నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నిరసన ఆందోళన చేపడుతామన్నారు. ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దుచేస్తే కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. మార్చి 3వ తేదీ వరకు దశల వారీ ఆందోళన చేపట్టి మార్చి 6న ఛలో విజయవాడకు కార్మికులు సిద్ధం కావాలని ప్రసాద్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బొబ్బిలి ఈశ్వరరావు, బంగారు రాజేష్ పాల్గొన్నారు.

అడుగడుగునా అప్రజాస్వామికం



తునిలో వంగా గీతను అడ్డుకున్న పోలీసులు



గొల్లప్రోలు టోల్‌ప్లాజా వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు కురసాల కన్నబాబు, అనంతబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి తదితరులు

- వైఎస్సార్ సీపీ నేతల నిర్బంధం
- 'చలో తుని'కి వెళ్లకుండా పోలీసు ఆంక్షలు
- గొల్లప్రోలు టోల్‌గేట్ వద్ద నేతల బైఠాయింపు

పిఠాపురం: శాంతియుతంగా తమ పార్టీ వారికి సంఘీభావం తెలపడానికి వెళుతున్న వైఎస్సార్ సీపీ నాయకులను పోలీసులు అప్రజాస్వామికంగా అడ్డుకున్నారు. దీంతో పోలీసుల తీరుకు నిసనగా వైఎస్సార్ సీపీ నేతలు నడి రోడ్డుపై బైఠాయించి ఆందోళన తెలియజేశారు. తుని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా టీడీపీ అరాచకాలకు నిరసనగా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా ఇచ్చిన పిలుపు మేరకు సంఘీభావం తెలపడానికి ఆ పార్టీ శ్రేణులు మంగళవారం భారీగా తుని బయలుదేరారు. వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు, ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, పిఠాపురం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి వంగా గీత తదితరులు తమ అనుచరులు పార్టీ శ్రేణులతో భారీగా తుని బయలుదేరారు. ఈ నేపథ్యంలో తునిలో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లను కలుసుకునేందుకు వీలు లేకుండా వంగా గీతను తునిలో అడ్డుకున్న పోలీసులు ఆమెను నిర్బంధించారు. గొల్లప్రోలు టోల్‌ప్లాజా వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు కురసాల కన్నబాబు, అనంతబాబు, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, పిల్లి సూర్యప్రకాష్‌లతో పాటు ఇతర నేతలను సీఐ శ్రీనివాస్ తన సిబ్బందితో అడ్డుకున్నారు. తుని వెళ్లడానికి అనుమతి లేదని నిషేధాజ్ఞలు ఉన్నాయని, తమ ఆదేశాలు కాదని వెళితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అయినప్పటికీ తాము శాంతియుతంగా తమ నాయకుడికి సంఘీభావం చెప్పడానికి వెళ్తుంటే ఈ నిషేధాజ్ఞలు విధించడంసరికాదని ముందుకు సాగబోగా పోలీసులు వారి కార్లను అడ్డుకున్నారు. దీంతో ఆ నాయకులందరూ గొల్లప్రోలు టోల్‌ప్లాజా వద్ద బైఠాయించి పోలీసులు, ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. తునిలో టీడీపీ నేతలు కార్యకర్తలకు అనుమతి ఇచ్చిన పోలీసులు కేవలం వైఎస్సార్ సీపీ నేతలకు మాత్రం ఆంక్షలు పెట్టడం అప్రజాస్వామికమని నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని, అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని పట్టించుకోడం లేదని పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు అన్నారు. మేమేమన్నా సంఘ విద్రోహ శక్తులమా అంటు పోలీసులను ప్రశ్నిస్తూ, టీడీపీ వారికి లేని ఆంక్షలు తమకెందుకని దుయ్యబట్టారు. సుమారు రెండు గంటల పాటు రోడ్డుపై ఆందోళన వ్యక్తం చేసిన నేతలు తుని వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు నిరాకరించడంతో కాకినాడకు తిరిగి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

'చలో తుని'కి వైఎస్సార్ సీపీ శ్రేణులు



రమణయ్యపేట వైద్యనగర్‌లో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయం నుంచి తునికి బయలుదేరుతున్న కన్నబాబు, అనంతబాబు, ద్వారంపూడి, తదితరులు

కాకినాడ రూరల్: తుని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో వైఎస్సార్ సీపీ చేపట్టిన చలో తుని కార్యక్రమానికి మంగళవారం నియోజకవర్గం నుంచి భారీగా శ్రేణులు తరలివెళ్లాయి. పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటరు, మాజీ మంత్రి, ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు రమణయ్యపేట వైద్యనగర్‌లోని పార్టీ కార్యాలయం నుంచి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్, కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, పిల్లి సూర్య ప్రకాశ్ తదితరులు వైద్యనగర్‌లో కన్నబాబు నివాసానికి ఉదయమే చేరుకోవడంతో వారంతా కలిసి కార్లలో ర్యాలీగా వెళ్లారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, నేమాం సర్పంచ్ రామదేవు సూర్యప్రకాశరావు, పార్టీ నాయకులు జమ్మలమడక నాగమణి, గోపిశెట్టి బాబ్జీ, చింతా ఈశ్వరరావు, రావూరి వెంకటేశ్వరరావు, తోటకూర శ్రీను, మంతూరి భాస్కర్, ముంజూరపు సూర్య కిరణ్, కోరాడ దుర్గా ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్‌తోనే ప్రభుత్వ పథకాలు



రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి విజయ్‌కుమార్


జిల్లా వ్యవసాయ అధికారి విజయ్‌కుమార్

కొత్తపల్లి: వ్యవసాయ రంగంలో రైతులకు సంక్షేమం, సాగు పెట్టుబడి సాయం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయని, అర్హులకు మాత్రమే వీటిని అందించేలా ప్రభుత్వం ప్రత్యేక పార్మర్ రిజిస్ట్రేషన్‌తో అందించేలా చర్యలు చేపడుతున్నట్టు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని నాగులాపల్లి, కొండెవరం, కొమరగిరి గ్రామాల్లో మంగళవారం పర్యటించి ఫార్మర్ రిజిస్ట్రేషన్లపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1,34,683 మంది పీఎం కిసాన్ లబ్ధిదారులు ఉండగా కేవలం 49 వేలు మంది మాత్రమే ఫార్మర్ రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారన్నారు. మిగిలిన వారు కూడా వేగంగా రైతు సేవా కేంద్రంలో నమోదు చేయించుకోవాలన్నారు. దీనిలో నమోదైన వారికి ఆధార్ మాదిరిగానే ఒక యూనిక్ ఐడీ కేంద్రం జారీ చేస్తుందన్నారు. సొంత భూమి ఉన్న రైతులు మాత్రమే ఇందులో నమోదు చేయించుకోవాలన్నారు.

కిడ్నాప్, దాడి కేసులో నిందితుల అరెస్టు

పిఠాపురం: దారిలో గాయాలతో ఉన్న వ్యక్తికి సాయం చేసేందుకు ఆగిన ఒక వ్యక్తిపై కొందరు వ్యక్తులు దాడి చేసి అతని దగ్గర ఉన్న నగదు దోపిడీ చేసిన కేసులో నిందితులను మంగళవారం అరెస్టు చేసినట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. ఈ నెల 11తేదీ రాత్రి పదిన్నర గంటల సమయంలో గొల్లప్రోలు దేవీ నగరానికి చెందిన ఉమ్మడి గంగాధర్ టైల్స్ పని చేసుకుని సురేష్ కళ్యాణ మండపం మీదుగా దేవీ నగరంలోని తన ఇంటికి వెళ్తున్నాడు. దారిలో అప్పటికే అక్కడ ఇరువర్గాలు కొట్లాడుకుంటుండగా, పిఠాపురం రథాల పేటకు చెందిన ఒక వ్యక్తికి గాయం కావడంతో మానవత్వంతో అతనికి సాయం చేయడానికి నీరు అందిస్తున్నాడు. ఇంతలో పిఠాపురం రథాల పేటకు చెందిన పెద్ద, చిన్న, ఆకాష్‌లతో పాటు గొల్లప్రోలుకు చెందిన గణేష్, అంజి బాధితుడు గంగాధర్‌ను బలవంతంగా బండిమీద ఎక్కించుకుని పిఠాపురం రథాలపేట ఏరియాలో ఉన్న నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ బీరు సీసాలతో, ఇనుపరాడ్లతో బాధితుడిపై దాడి చేసి గాయపరిచి అతని జేబులో ఉన్న రూ.3800 దోచుకున్నారు. అతనిని అదే రోజు రాత్రి మూడు గంటల ప్రాంతంలో గొల్లప్రోలు టోల్ ప్లాజా వద్ద వదిలివేసి వెళ్లిపోయారు. గాయాలతో ఉన్న బాధితుడు నడుచుకుంటూ ఇంటికి చేరుకుని జరిగిన సంఘటన తన బంధువులకు చెప్పాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చగా కోర్టు రిమాండ్ విధించినట్లు ఎస్సై ఎస్.రామకృష్ణ తెలిపారు.

రహదారిపై సామగ్రి పెడితే చర్యలు



సరిహద్దు ఏర్పాటు చేసి నో పార్కింగ్ అని రాస్తున్న ట్రాఫిక్ సిబ్బంది

సామర్లకోట: దుకాణాల యజమానులు షాపుల పరిధి మించి రోడ్లపైకి సరకు పేర్చితే చర్యలు ఉంటాయని డీఎస్పీ డి.శ్రీహరిరాజు హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం స్థానిక స్టేషన్ సెంటర్‌లోని బట్టల షాపుల యజమానులు రోడ్లపైకి బ్యాగ్‌లు పెట్టడంతో, ఇతర షాపుల యజ మానుల ఫిర్యాదు మేరకు ఆయా షాపులను ఆయన పరిశీలించారు. షాపులలోనే వ్యాపారాలు చేసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు నో పార్కింగ్ అని వ్రాయాలని ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావుకు సూచించారు. షాపుల వద్ద ఏర్పాటు చేసిన బోర్డరును మించి వస్తే చర్యలు ఉంటాయన్నారు. వ్యాపారాలు చేసుకొనే సమయంలో ఇతరులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.

వైద్యారోగ్య సర్వే పరిశీలన



గోరింటలో సర్వేను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ నరసింహ నాయక్

పెద్దాపురం: మండలంలోని గోరింట గ్రామంలో జరుగుతున్న ఎన్‌సీడీసీడీ, ఆర్‌బీఎస్‌కే వైద్య సర్వే ప్రక్రియను మంగళవారం జిల్లా వైద్యశాఖాధికారి (డీఎంఅండ్‌హెచ్‌ఓ) డాక్టర్ నరసింహనాయక్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రభాకర్ పరిశీలించారు. పులిమేరు పీహెచ్‌సీ వైద్యులు శ్రావణి ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ నరసింహనాయక్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఆరోగ్య పరీక్షల సర్వే నిర్వహించనున్నట్టు తెలిపారు. పులిమేరు పీహెచ్‌సీ పరిధిలోని 10 గ్రామాల్లో డయాబెటిక్, హైపర్ టెన్షన్, క్యాన్సర్‌పై ఇంటింటా సర్వే 30 శాతం పూర్తి చేసినట్టు తెలిపారు. 35 అంగన్‌వాడీ కేంద్రాల్లో నూరుశాతం వైద్య పరీక్షల సర్వేను పూర్తి చేసినందుకు పీహెచ్‌సీ సిబ్బందిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో వైద్యాధికారి దీపిక, వైద్య సిబ్బంది ప్రభాకర్, సురేష్, ఏఎన్‌ఎం, ఆశ తదితరులు పాల్గొన్నారు.

కరప మండల గ్రామ సర్పంచ్‌లు, గ్రామకార్యదర్శులు

ఎం.అనుపమ, ఎంపీడీఓ 9346790319,
పెంకే శ్రీలక్ష్మి, ఎంపీపీ 9908778808

గ్రామం	సర్పంచ్		కార్యదర్శి	
అరట్లకట్ట	గోపి సత్యవేణి	7993605566	వై.రాంజీ	7416299365
జి.భావారం	రొక్కాల గనిరాజు	9502319888	కె.సంతోష్ మహదేవశర్మ	9666731272
గొడ్డటిపాలెం	గోన అనూష	8247395677	పి.త్రిమూర్తులు	9912985999
గొర్రిపూడి	కానూరి రమాదేవి	6301293869	కేఎస్ఎస్ సుధారాణి	9441031469
			ఎస్.వీరబాబు	9959327477
కరప	సాదే ఆశాజ్యోతి	9532066467	యు.నిర్మలాదేవి	9705687699
కొరిపల్లి	పలివెల నాగేశ్వరరావు	9666375249	ఆర్.సుబ్బలక్ష్మి	9640833799
కూరాడ	రావుల సూర్యచంద్రావతి	9014124070	ఎం.దుర్గాప్రసాద్	9494894376
నడకుదురు	డేగల లలితకుమారి	9666566235	వి.గోపాలకృష్ణ	9491369021
			కె.వరిజ	9676476445
పాతర్లగడ్డ	నాగిరెడ్డి ఏసుబాబు	9948445419	పి.సుధాకర్	8309460718
పెదకొత్తూరు	చింతా నాగలక్ష్మి	9848295290	పి.సునీల్	9705804540
పెద్దాపురప్పాడు	బిరుదా సరస్వతి	7993903954	ఎం.వీరభద్రరావు	9248356675
సిరిపురం	నున్న సుజాత	9989417657	డి.దుర్గాభవాని	9491729558
వాకాడ	అడబాల సత్య	9951975888	పి.సునీల్	9705804540
వలసపాకల	వాసంశెట్టి రామారావు	9553395145	ఎం.విజయలక్ష్మి	9912495319
వేళంగి	సవిలే నీలిమ	8790503563	పి.వీరభద్రరావు	7702400927
విజయరాయుడుపాలెం	వి.సీతారామరాఘవ	9182824192	ఎస్.వీరబాబు	9959327477
యండమూరు	మారెళ్ల శ్రీనివాసరావు	8688433626	పీఎస్‌వీఆర్ బహ్మానందం	9912697957
జెడ్.భావారం	కొత్త నాగలక్ష్మి	9014074678	వి.శ్రీదేవి	9490710952
పెనుగుదురు	రెడ్డిపల్లి వెంకటమాధవి	8498033555	బి.చంద్రకళ	7036554234
గురజనాపల్లి	అనుసూరి శ్రీనివాసరావు	9640273737	ఎంవీఎస్ఎస్ఎన్ సురేష్	9949859045
కొంగోడు	నక్కా అప్పలస్వామి	9494106999	పి.వీరభద్రరావు	7702400927
వేములవాడ	కమిడి మంగాదేవి	9959570866	పి.ఉమామహేశ్వరి	9848914135
ఉప్పలంక	బొమ్మిడి నయోమి	6305247836	ఎం.భవాని	7989606142